# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

గురువారం 11, జూన్ 2026




## విదేశీ ఉద్యోగాలకు
# యువత సిద్ధం కావాలి

- మంత్రి వివేక్ వెంకటస్వామి
- మందమర్రిలో జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమం ప్రారంభం

**మందమర్రి, జూన్ 10, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర యువతకు విదేశాల్లో మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టీఓఎంసీఓఎం), ఉపాధి, శిక్షణ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమం బుధవారం మందమర్రిలో ఘనంగా ప్రారంభమైంది. మందమర్రిలోని స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ ఎల్లందు క్లబ్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉపాధి, శిక్షణ, కర్మాగారాలు, కార్మిక శాఖ, గనులు మరియు భూగర్భ శాస్త్ర శాఖ మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి వివేక్ మాట్లాడుతూ, జర్మనీతో పాటు ఇతర యూరోపియన్ దేశాల్లో ఉపాధి అవకాశాలను పొందేందుకు జర్మన్ భాషపై పట్టు సాధించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ శిక్షణ ద్వారా అభ్యర్థులు ప్రాథమిక, మధ్యస్థాయి భాషా నైపుణ్యాలను పెంపొందించుకొని అంతర్జాతీయ ఉద్యోగ మార్కెట్‌లో పోటీ పడగలరని తెలిపారు. విదేశీ ఉపాధి రంగంలో తెలంగాణ యువత ముందంజలో నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం జర్మన్ "ఆస్బిల్డుంగ్" ప్రోగ్రామ్‌కు ఎంపికైన అభ్యర్థులకు మంత్రి చేతుల మీదుగా ఆఫర్ లెటర్లను అందజేశారు. అలాగే శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో ముఖాముఖ సమావేశం నిర్వహించి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ మాట్లాడుతూ, సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మిగతా 2లో..





## అక్రిడిటేషన్ కార్డుల పేరుతో వసూళ్లకు పాల్పడితే
# కఠిన చర్యలు

- నిర్మల్ కలెక్టర్ భవేష్ మిశ్రా

**నిర్మల్, జూన్ 10, ప్రభాతవార్త:**

జిల్లాలో జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరుగుతోందని, ఈ కార్డుల పేరుతో ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా హెచ్చరించారు. అక్రిడిటేషన్ కార్డులు ఇప్పిస్తామంటూ కొందరు వ్యక్తులు అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని బుధవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఇది తీవ్రమైన అంశమని పేర్కొంటూ, ప్రభుత్వం ఉచితంగా జారీ చేసే అక్రిడిటేషన్ కార్డుల కోసం ఎవరికీ ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అక్రిడిటేషన్ కార్డుల కోసం ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే సంబంధిత జిల్లా పౌరసంబంధాల అధికారి (డీపీఆర్‌వో)కి లేదా నేరుగా తమకు సమాచారం అందించాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, అక్రమాలకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు అందజేస్తామని, దళారులను నమ్మి మోసపోవద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# గంజాయి, మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

- రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెరగాలి
- హెల్మెట్లు, ప్రథమ చికిత్స కిట్ల పంపిణీ
- తోషం గ్రామసభలో డీజీపీ సి.వి. ఆనంద్



**ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 10, ప్రభాతవార్త**

యువత గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి విద్య, క్రీడలు, ఉపాధి అవకాశాలపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ పిలుపునిచ్చారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలోని తోషం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో రాష్ట్ర డీజీపీ జిల్లా కలెక్టర్ రాజర్షి షా తో కలిసి పాల్గొని మాట్లాడారు. గ్రామసభ ప్రారంభానికి ముందు ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం గ్రామ పెద్దలు, గ్రామస్తులు డీజీపీకి ఘన స్వాగతం పలికారు. అనంతరం కొమరం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గుస్సాడి కళాకారుల సంప్రదాయ మిగతా 2లో..

# ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

**ఆసిఫాబాద్, జూన్ 10, ప్రభాతవార్త :**

విద్యార్థులు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ సూచించారు. అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆసిఫాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాల్లో సీటు బెల్టులు వినియోగించాలని తెలిపారు. ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా లక్షలాది రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటిలో యువత అధికంగా ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని అన్నారు. త్రిబుల్ రైడింగ్, మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం, రాంగ్ సైడ్‌లో వాహనం నడపడం వంటి మిగతా 2లో..



# అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

- కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత



**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 10, ప్రభాతవార్త :**

ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లాలోని కాగజ్ నగర్ పట్టణంలోని 27వ వార్డులో పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఏర్పాటుచేసిన వార్డు సభకు మున్సిపల్ కమిషనర్ తిరుపతి, చైర్ పర్సన్ షహీన్ సుల్తానాతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పేదవారికి మిగతా 2లో..

## విదేశీ ఉద్యోగాలకు
# యువత సిద్ధం కావాలి

(మొదటిపేజీ తరువాయి)

స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ స్థానిక యువతకు సాంకేతిక నైపుణ్యాలు అందిస్తూ ఉపాధి అవకాశాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఇప్పుడు టామ్కామ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయి జర్మన్ భాషా శిక్షణకు కూడా ఈ కేంద్రం వేదిక కావడం గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి మరియు శిక్షణ శాఖ కమిషనర్ ఎ. కాంతి వెస్లీ ఐఏఎస్, అదనపు కలెక్టర్లు పి. చంద్రయ్య ఐఏఎస్, బి. రాములు, జాయింట్ డైరెక్టర్ రేఖారాణి, డిప్యూటీ డైరెక్టర్ రమేష్‌బాబు, టామ్ కామ్ జనరల్ మేనేజర్ నాగభారతి, మందమర్రి మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు, రీజినల్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ రాము, జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ, టామ్ కామ్ మేనేజర్ అనిల్‌కుమార్, సింగరేణి జీఎంవీటీసీ అదనపు మేనేజర్ శ్రీధర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, శిక్షకులు, పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు. విదేశీ ఉపాధిపై ఆసక్తి ఉన్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని అధికారులు పిలుపునిచ్చారు.

# ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

(మొదటిపేజీ తరువాయి)

నిరక్ష్య చర్యల వల్లే ఎక్కువ శాతం ప్రమాదాలు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ట్రాఫిక్ నియమాలను పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని అన్నారు. అనంతరం జిల్లాలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన దృశ్యాలను విద్యార్థులకు స్క్రీన్‌పై ప్రదర్శించి అవగాహన కల్పించారు. కార్యక్రమం ముగింపులో అధికారులు, విద్యార్థులందరూ రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) చిత్తరంజన్, ఆసిఫాబాద్ డీఎస్పీ అశోక్, ప్రభుత్వ వైద్య కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రియదర్శిని, ఆసిఫాబాద్ ఎస్హెచ్ఓ బాలాజీ వరప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ సతీష్, మెడికల్ కాలేజ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

(మొదటిపేజీ తరువాయి)

సంక్షేమ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని, ప్లాస్టిక్ సంచులు, బాటిళ్లను చెత్త కుండీలలో మాత్రమే వేయాలని తెలిపారు. చెత్త చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి వర్షాకాలంలో మురికి కాలువలలో నీటిని అడ్డుకుని ఇండ్లలోకి చేరి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందని, ఈ విషయంగా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలని, ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలలో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని తెలిపారు. అనంతరం పురపాలక సంఘం చైర్మన్, కౌన్సిలర్లతో కలిసి రెండు పడక గదుల ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసిడింగ్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, లబ్ధిదారులు, ప్రజలు పాల్గొన్నారు.



# గంజాయి, మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

నృత్య ప్రదర్శనలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఆదివాసీల సమస్యలను డీజీపీ అడిగి తెలుసుకున్నారు. మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితాలతో పాటు కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. యువత సానుకూల దృక్పథంతో ముందుకు సాగి సమాజాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండి లక్ష్యాలను నిర్దేశించుకొని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాగంగా 30 మంది ఆటో డ్రైవర్లకు ప్రమాద సమయాల్లో ఉపయోగపడే ప్రథమ చికిత్స కిట్లను పంపిణీ చేశారు. ప్రమాదాల సమయంలో



రక్తస్రావాన్ని నియంత్రించి ప్రాణాలను కాపాడడంలో ఈ కిట్లు ఉపయోగపడతాయని వివరించారు. అదేవిధంగా తోషం, తోషం తాండా, రాగాపూర్, బోర్రమద్ది, పూనగూడ, తోయిగూడ గ్రామాలకు చెందిన ఆదివాసీ యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షిస్తూ ఐదు వాలీబాల్ కిట్లను అందజేశారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పించే ఉద్దేశంతో గ్రామసభకు హాజరైన సుమారు 200 మంది ప్రజలకు హెల్మెట్లను పంపిణీ చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ వినియోగించాలని డీజీపీ సూచించారు. అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబరిచిన మహిళలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కుటుంబ సభ్యుల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడంలో మహిళల పాత్ర కీలకమని పేర్కొన్నారు. యువతలో డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలనే ఉద్దేశంతో నిర్వహించిన డ్రైవింగ్ లైసెన్స్ మేళాలో పాల్గొన్న 75 మంది యువతకు లర్నింగ్ లైసెన్సులను అందజేశారు. ప్రతి వాహనదారుడు చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. అలాగే గతంలో లొంగిపోయిన ముగ్గురు మాజీ మావోయిస్టులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మల్టీజోన్1 ఐజీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు ఎస్పీ (అడ్మిన్) పి. మోనిక, ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే, గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు, ప్రజలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# బదిలీపై వెళ్తున్న పంచాయితీ కార్యదర్శి కుమ్మరి హరీష్‌కు ఘన సన్మానం

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 10, ప్రభాతవార్త**



చింతగూడ గ్రామ పంచాయతీలో గత నాలుగు సంవత్సరాలుగా పంచాయితీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ గ్రామ అభివృద్ధికి విశేష సేవలందించిన కుమ్మరి హరీష్ బదిలీపై ఇతర ప్రాంతానికి వెళ్తున్న సందర్భంగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మంగళవారం ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు హరీష్ సేవలను కొనియాడారు. గ్రామంలో పారిశుధ్యం, అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారంలో ఆయన చూపిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షి ంచారు. ఈ సందర్భంగా పంచాయితీ కార్యదర్శి కుమ్మరి హరీష్ మాట్లాడుతూ చింతగూడ గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, సహోద్యోగులు అందించిన సహకారాన్ని ఎప్పటికీ మరువలేనని, తనపై చూపిన ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్ ఆత్రం ఆకాష్, వార్డు మెంబర్లు సాయి ప్రకాష్, భీంరావు, సంజీవ్, సాగర్, మాజీ ఎంపీటీసీ నికూరే నాగేందర్, అచల్, రావుల నరేష్, పోచయ్య, కారోబార్ మహేష్,పంచాయతీ సిబ్బంది,గ్రామ పెద్దలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలకు నోటు బుక్స్, పాఠ్యపుస్తకాల పంపిణీ ప్రారంభం



**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 10, ప్రభాతవార్త**

జిల్లా విద్యాధికారి ఆదేశాల మేరకు కాగజ్‌నగర్ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు 2026-27 విద్యా సంవత్సరానికి అవసరమైన నోటు బుక్స్, పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించినట్లు మండల విద్యాధికారి (ఎంఈఓ) వాసాల ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేలోపు ప్రతి ప్రభుత్వ పాఠశాలకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోటు బుక్స్ అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మండల విద్యా వనరుల కేంద్రం (ఎంఆర్సీ) నుండి తమ పాఠశాలలకు కేటాయించిన పుస్తకాలను వెంటనే తీసుకెళ్లి విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యార్థులకు విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే అవసరమైన విద్యా సామగ్రి అందించడం ద్వారా బోధన, అభ్యాస ప్రక్రియ సజావుగా సాగేందుకు ఈ పంపిణీ కార్యక్రమం ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ ఆరెగూడ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు పి. చంద్రశేఖర్, జెడ్పీఎస్ఎస్ పెట్రోల్ పంప్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వెంకట్రాజయ్య, సమగ్ర శిక్ష సీఎంఓ కొయ్యడ శ్రీనివాస్‌తో పాటు మండలంలోని పలువురు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థుల చదువుల్లో వెలుగులు నింపుతున్న రాజేష్‌కు గౌరవ డాక్టరేట్

**బెల్లంపల్లి, జూన్ 10, ప్రభాతవార్త**

సమాజంలోని పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించాలనే సంకల్పంతో నిరంతర సేవలు అందిస్తున్న మడే రాజేష్‌కు అరుదైన గౌరవం లభించింది. ఆయన చేస్తున్న విశిష్ట సామాజిక సేవలను గుర్తించిన ఏషియన్ వేదిక్ ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ రీసెర్చ్ స్ఫూర్తి అకాడమీ సంస్థ ప్రతిష్టాత్మక గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయనుంది. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం పాత బెల్లంపల్లి గ్రామానికి చెందిన మడే రాజేష్, వ్యవసాయ కూలీలు మడే భాగ్యలక్ష్మి, భీమయ్య దంపతుల పెద్ద కుమారుడు. పేద కుటుంబం నుంచి వచ్చిన ఆయన, తాను ఎదుర్కొన్న ఆర్థిక కష్టాలను ఇతర విద్యార్థులు అనుభవించకూడదనే ఉద్దేశంతో వృత్తి విద్యా కళాశాలను స్థాపించారు. పేద విద్యార్థులకు ఉచిత విద్య, ఉన్నత చదువులకు మార్గదర్శకత్వం అందిస్తూ, అవసరమైన వారికి ఆర్థిక సహాయం చేస్తూ సమాజానికి సేవ చేస్తున్నారు. ఈ సేవలను గుర్తించిన సంస్థ హైదరాబాద్‌లో త్వరలో నిర్వహించనున్న అవార్డు ప్రదానోత్సవంలో ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను అందించనుంది. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ తనకు లభించిన ఈ గౌరవం మరింత సేవా కార్యక్రమాలు చేయాలనే బాధ్యతను, ఉత్సాహాన్ని పెంచిందని ఆనందం వ్యక్తం చేశారు.



# మార్క్‌ఫెడ్ నుంచి యూరియా పంపిణీ ఇంక ఎప్పుడో...

**ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల కొరకు రైతుల ఎదురుచూపులు - అన్ని జిల్లాల్లో మార్క్‌ఫెడ్ ద్వారా సరఫరా.. కొమురం భీం జిల్లాలో లేదంటున్న రైతులు**

**కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 10, ప్రభాతవార్త:**




ఖరీఫ్ సీజన్ ప్రారంభమోతున్న నేపథ్యంలో కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో రైతులు యూరియా ఎరువుల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం జిల్లాలో వరి, పత్తి, సోయాబీన్, కందులు తదితర పంటల సాగు పనులు సాగుతుండగా, రైతులకు అత్యంత అవసరమైన యూరియా అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా మార్క్‌ఫెడ్ ద్వారా జిల్లాకు ఇప్పటివరకు యూరియా సరఫరా కాకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని ప్యాక్స్, హాకా, డీసీఎంఎస్, ఏఆర్ఎస్‌కే, కేంద్రాలు రైతులకు ఎరువులు అందించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, మార్క్‌ఫెడ్ నుంచి యూరియా రాకపోవడంతో రైతులు ఏమితోచనీ పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు ప్రైవేట్ ఎరువుల దుకాణాలనే ఆశ్రయించాల్సి వస్తోంది. పంటల సాగులో ఆలస్యం కాకుండా ఉండాలనే ఉద్దేశంతో రైతులు ప్రైవేట్ దుకాణాలకు వెళ్లి అధిక ధరలకు అయినా యూరియా కొనుగోలు చేస్తున్నారు. ఇతర జిల్లాల్లో మార్క్‌ఫెడ్ ద్వార యూరియా పంపిణీ ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ, కొమురం భీం జిల్లాలో మాత్రం ఇంకా సరఫరా ప్రారంభం కాకపోవడం రైతుల్లో తీవ్ర అసంతృప్తికి కారణమవుతోంది. జిల్లాలోని అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. పంట పెరుగుదలలో యూరియా కీలక పాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా ప్రారంభ దశలో పంటలకు యూరియా అందకపోతే ఎదుగుదల మందగించి, దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశంవుంటుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే వర్షాలు కురవడం మొదలవడంతో సాగు పనులు వేగం పుంజుకోగా, ఎరువుల కొరత రైతుల్లో మరింత ఆందోళనకు గురిచేస్తోంది. యూరియా కోసం రైతులు ప్రవేట్ ఫెర్టిలేజర్ షాపులలో ఉన్నపటికీ వారు ఎప్పుడు యాప్‌లో ఎప్పుడు పెడుతున్నారో తెలియని పరిస్థితి అది అలా వుంటే లింకుల పేరిట మరో రకంగా ధరలు పెంచి అమ్ముతున్నారు. బిల్ చూస్తే 266 వల్ల దగ్గర ఇయలసింది మాత్రం 360 నుండి 450 వరకు అవుతోందని వాపోతున్నారు. వెంటనే స్పందించి అధికారులు మార్క్ పేడ్ ద్వార తగినంత యూరియా కేటాయించాలని రైతులు అంటున్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. లేదంటే రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని రైతు సంఘాల నాయకులు అంటున్నారు. ఖరీఫ్ సీజన్ రైతులకు అత్యంత కీలకమైన సమయం ఇలాంటి సమయంలో యూరియా లేకపోవడం వ్యవసాయ రంగానికి శుభపరిణామం కాదని, ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి జిల్లాలో ఎరువుల కొరత నివారణకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## బెల్లంపల్లి అభివృద్ధికి సింగరేణి సహకారం కోరిన మున్సిపల్ ప్రతినిధులు

**బెల్లంపల్లి, జూన్ 10, ప్రభాతవార్త:**

బెల్లంపల్లి పట్టణ అభివృద్ధికి సంబంధించి పలు కీలక అంశాలపై సింగరేణి సంస్థ సహకారం కోరుతూ బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతిరమేష్ బాబు ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు మందమర్రి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. ఈ కార్యక్రమం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు నిర్వహించబడింది. పట్టణ అభివృద్ధిలో భాగంగా చేపట్టిన రోడ్ల విస్తరణ పనులకు ఆటంకంగా ఉన్న సింగరేణి ప్రహరీ గోడను తొలగించేందుకు అనుమతి ఇవ్వాలని జీఎంను కోరారు. అలాగే పట్టణంలోని సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యులు మరియు చిన్నారులు సాయంత్రం వేళ వినోదంగా గడిపేందుకు ఏఎంసీ ఏరియాలో ఉన్న సింగరేణి పార్కును అభివృద్ధి చేయాలని సూచించారు. ఇదే సందర్భంగా సింగరేణి ఫంక్షన్ హాల్‌ను ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేస్తే ప్రజలకు, సంస్థకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. పట్టణానికి చెందిన క్రీడాకారుల ప్రతిభకు వేదికైన తిలక్ స్టేడియంను పునరుద్ధరించి, పార్కులో చిన్నారుల కోసం ఆట వస్తువులు ఏర్పాటు చేయడంతో పాటు ఇండోర్ గేమ్స్‌కు అవసరమైన సదుపాయాలు కల్పించాలని కోరారు. అదనంగా పట్టణంలో ప్రజల సౌకర్యార్థం పబ్లిక్ టాయిలెట్లు నిర్మించేందుకు సింగరేణి స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే సంవత్సరాలుగా నివసిస్తున్న నిరుపేదలు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సిద్ధమవుతున్న సమయంలో సింగరేణి అధికారులు స్థల సమస్యలతో అడ్డుపడుతున్నారని, వారికి సహకరించి ఇళ్లు నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని జీఎంను కోరారు. ఈ సందర్భంగా జీఎం రాధాకృష్ణ సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.





ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపి నాయకులు

## మోదీ 12 ఏళ్ల పాలన దేశ అభివృద్ధికి స్వర్ణయుగం

*** బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి**

**మంచిర్యాల, జూన్ 10 ప్రభాతవార్త :**

దేశ ప్రధానిగా ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ 4399 రోజుల రికార్డు పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ నాయకులు బుధవారం మంచిర్యాల పట్టణంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి, జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో మోదీ చిత్రపటంతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక విశ్వనాథ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, దేశ పరిపాలనలో మరింత విజయాలు సాధించేలా ప్రధానికి భగవంతుడు శక్తిని ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా రఘునాథ్ వెరబెల్లి మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలనలో దేశం అన్ని రంగాల్లో విశేష పురోగతి సాధించిందన్నారు. ప్రపంచ దేశాల సరసన భారత్‌ను నిలబెట్టడంలో మోదీ నాయకత్వం కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. పేదలు, రైతులు, మహిళలు, యువత సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి కోట్లాది మందికి లబ్ధి చేకూర్చారని కొనియాడారు. మంచిర్యాల జిల్లాకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చిందని, జిల్లాను ఆనుకుని జాతీయ రహదారుల అభివృద్ధి, మంచిర్యాల రైల్వే స్టేషన్ ఆధునీకరణ, గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల మౌలిక సదుపాయాల కోసం వేల కోట్ల రూపాయల నిధులు కేటాయించిందన్నారు. రానున్న రోజుల్లో మోదీ నాయకత్వంలో దేశం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దుర్గం అశోక్, రంగ శ్రీశైలం, అమిరిశెట్టి రాజ్‌కుమార్, సత్రం రమేష్, కుర్రె చక్రవర్తి, వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, ఎనగందుల కృష్ణమూర్తి, గోలి రాము, మాధవరపు రమణరావు, కస్తూరి నాగరాజు, బోట్ల అనిత, తుల ఆంజనేయులు, జోగుల శ్రీదేవి, కమలాకర్‌రావు, ఆకుల అశోక్‌వర్ధన్, ఆవిడపు రాజబాబు, మెట్టుపల్లి జయరామరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఉదారత చాటుకున్న తేజాపూర్ వాసి

**నేరడిగొండ, జూన్ 10, ప్రభాతవార్త**

మండల కేంద్ర పరిధిలోని తేజాపూర్ గ్రామానికి చెందిన దాసరి అరవింద్ అనే వ్యక్తి తన ఉదారతను చాటుకొని పలువురికి ఆదర్శంగా నిలిచారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఒక అపరిచిత వ్యక్తి నుండి గూగుల్ పే ద్వారా దాసరి అరవింద్ బ్యాంక్ ఖాతాలో పొరపాటున ..76,350 రూపాయలు జమ అయ్యాయి. ఖాతాలో అపరిచిత డబ్బులు పడిన విషయాన్ని గమనించిన అరవింద్ వెంటనే స్పందించారు. ఆ అపరిచిత వ్యక్తిని ఫోన్ ద్వారా సంప్రదించి, సదరు నగదును పూర్తిగా తిరిగి పంపి తన నిజాయితీని, ఉదారతను చాటుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు, స్థానికులు దాసరి అరవింద్‌ను ప్రత్యేకంగా అభినందించారు.



న్యూలోలం గ్రామంలో ప్రత్యేక గ్రామసభలో మాట్లాడుతున్న డీపీఓ శ్రీనివాస్, అధికారులు

## పర్యావరణ పరిరక్షణే ఆరోగ్యానికి పునాది: డీపీఓ శ్రీనివాస్

**దిలావర్‌పూర్, జూన్ 10, ప్రభాతవార్త:**

దిలావర్‌పూర్ మండలం న్యూ లోలం గ్రామంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) శ్రీనివాస్ పర్యావరణ పరిరక్షణపై కీలక సందేశం ఇచ్చారు. మన ఆరోగ్యం, మన భవిష్యత్తు పర్యావరణ రక్షణపైనే ఆధారపడి ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్ల నరికివేతను ఆపి, ప్రతి ఒక్కరూ పెద్ద ఎత్తున మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. అడవుల నరికివేత వల్ల ఉష్ణోగ్రతలు పెరిగి అనేక రకాల కొత్త రోగాలు ఉత్పన్నమవుతున్నాయని హెచ్చరించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి పచ్చదనాన్ని పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. గ్రామసభ అనంతరం అధికారులు గ్రామంలో సాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులతో పాటు స్టీల్ బ్యాంక్ వంటి వివిధ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిపై ఈ సందర్భంగా వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శ్రీలత, డీఎల్‌పీఓ లింగయ్య, ఎంపీడీఓ అరుణ, ఎంపీఓ గోవర్ధన్, ఏఓ రాజశేఖర్ రెడ్డి, ఏఈ శివకుమార్, ఏపీఓ దివ్య రెడ్డి, ఏపీఎం బోస్, హౌసింగ్ ఏఈ సనా ఫాతిమా, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ప్యారామూర్‌లో నర్సరీని పరిశీలించిన ఎంపీఓ అజీజ్ ఖాన్

**సారంగాపూర్, జూన్ 10, ప్రభాతవార్త:**

మండలంలోని ప్యారామూర్ గ్రామంలో ఎంపీఓ అజీజ్ ఖాన్ బుధవారం పర్యటించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు ఏ విధంగా సాగుతున్నాయనే అంశాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాబోయేది వర్షాకాలం కావడంతో మురుగు కాలువలు, పాఠశాల పరిసరాలలో ఎలాంటి చెత్తాచెదారం లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని నర్సరీని తనిఖీ చేసి అక్కడున్న సిబ్బందితో మొక్కల పెంపకం గురించి ఆరాతీశారు. మొక్కలకు నీరు సరిగ్గా అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం ప్లాంటేషన్ సమీపిస్తున్నందున మొక్కలను మరింత జాగ్రత్తగా పెంచాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మాకునూరు వరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి మహేందర్, నాయకులు సాయన్న, పారిశుధ్య కార్మికులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



నర్సరీని తనిఖీ చేసి మొక్కల పెంపకాన్ని పరిశీలిస్తున్న ఎంపీఓ అజీజ్ ఖాన్, సర్పంచ్ వరలక్ష్మి



## మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాల పెంపు

### - చైర్‌పర్సన్‌కు కృతజ్ఞతలు తెలిపిన కార్మికులు

**బెల్లంపల్లి, జూన్ 10, ప్రభాతవార్త**

బెల్లంపల్లి మున్సిపాలిటీ కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచిన సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు లను కార్మికులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి తమ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషిస్తున్న మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు శ్రమదోపిడికి గురి కాకూడదనే ఉద్దేశంతో, గతంలో ఇచ్చిన హామీ మేరకు వేతనాలు పెంచినట్లు తెలిపారు. పట్టణ స్వచ్ఛత కోసం అహర్నిశలు కష్టపడుతున్న కార్మికుల సేవలను కొనియాడుతూ, పెరుగుతున్న నిత్యావసర ధరలను దృష్టిలో ఉంచుకొని వేతనాల పెంపు చేపట్టామని పేర్కొన్నారు. కార్మికుల కళ్లలో ఆనందం చూడడం తమకు ఆత్మసంతృప్తిని ఇచ్చిందని అన్నారు.అలాగే, వెంటనే స్పందించి వేతనాల పెంపుకు సహకరించిన కాంట్రాక్టర్లు, మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్, డీఈ సుమతి, ఏఈ నిచల్ లకు చైర్‌పర్సన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కాంట్రాక్టర్లు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



## సంఘ క్రమశిక్షణ ఉల్లంఘన... సభ్యుడి సభ్యత్వం రద్దు, శాశ్వత బహిష్కరణ

### - మందమర్రి ఆర్.ఎం.పి - పి.ఎం.పి అనుభవ వైద్యుల సంఘం

**మందమర్రి, జూన్ 10, ప్రభాతవార్త :**

మందమర్రి పట్టణ ఆర్.ఎం.పి – పి.ఎం.పి అనుభవ వైద్యుల సంఘానికి చెందిన సభ్యుడు తాటికొండ రవికుమార్‌ను సంఘ క్రమశిక్షణా నియమావళిని ఉల్లంఘించిన కారణంగా సంఘం నుండి శాశ్వతంగా బహిష్కరించినట్లు సంఘ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పట్టణ కార్యవర్గ సభ్యులపై అసభ్యకరమైన, అవమానకరమైన వ్యాఖ్యలు చేయడంతో పాటు సంఘ ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా వ్యవహరించినందున కార్యవర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఈ చర్య చేపట్టినట్లు కమిటీ సభ్యులు వెల్లడించారు. ఇకపై తాటికొండ రవికుమార్‌కు మందమర్రి పట్టణ ఆర్.ఎం.పి – పి.ఎం.పి అనుభవ వైద్యుల సంఘంతో ఎటువంటి సంబంధం లేదని, సంఘం తరఫున మాట్లాడే లేదా ప్రాతినిధ్యం వహించే హక్కు లేదని కమిటీ సభ్యులు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సంఘ అధ్యక్షులు, కార్యదర్శి గోనె గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి అడ్డూరి సాంబమూర్తి, గాదాసు శంకరయ్య, రాష్ట్ర కార్యదర్శి కట్ల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు చింతల పోషం, గాజుల శంకర్, ఏ. లక్ష్మణ్, బి. జనార్ధన్, తిప్పని శ్రీనివాస్, ఎం.డి. మతీన్ ఖాన్, ఎస్.ఏ. ఖాన్, గోనె సత్యం, గందం శ్రీనివాస్, కుక్కల శ్రీనివాస్, అరె రాజేశం తదితరులు పాల్గొన్నారు.

## శాంతిఖని ప్రాజెక్ట్ అధికారిగా సొడమల్ల సంతోష్ కుమార్

**బెల్లంపల్లి, జూన్ 10, ప్రభాతవార్త:**



బెల్లంపల్లి పట్టణంలోని శాంతిఖని బొగ్గు గని ప్రాజెక్ట్ అధికారిగా సొడమల్ల సంతోష్ కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన అబ్దుల్ ఖదీర్ మందమర్రి ఏరియాలోని కేకే గ్రూప్ ఏజెంట్‌గా బదిలీ అయ్యారు. కాగా సంతోష్ కుమార్ అర్జీ 2 ఏరియా రక్షణ అధికారిగా పనిచేసి శాంతి ఖని కి బదిలీపై వచ్చారు. ఈ యన గతం లో బెల్లంపల్లి రీజియన్ లోని ఆర్కే 6,ఎస్ ఆర్పీ 3 గనుల్లో, రామగుండం రిజియన్ లోని జీ డీ కే10 ఇంక్లైన్ గనిలో మేనేజర్ గాపని చేస్తూ డివై జీఎం గా కూడా పదోన్నతి పొందారు.

# ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణను పకడ్బందీగా నిర్వహించాలి

### - జిల్లా అదనపు కలెక్టర్ రాములు

**తాండూర్, జూన్ 10, ప్రభాతవార్త :**

జూన్ 25వ తేదీ నుంచి చేపట్టనున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు అన్నారు. తాండూర్ తహసిల్దార్ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం, సాదా బైనామా దరఖాస్తులు, భూభారతి పెండింగ్ దరఖాస్తుల పరిష్కరణ సంబంధిత అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 3వ విడత సర్ లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా జూన్ 25 వ తేదీ నుంచి నిర్వహించనున్న ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాటులకు తావు లేకుండా సక్రమంగా నిర్వహించాలన్నారు. బూతు స్థాయి అధికారులు ప్రతి ఇంటికి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని, సూపర్వైజర్లు, ఏఈఆర్వోలు పనుల పురోగతిని పరిశీలించాలని తెలిపారు. ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం భూ భారతి పోర్టల్ ను అందుబాటులోని తీసుకువచ్చి ప్రజల యొక్క ప్రతి సమస్యను పరిష్కరించడం జరుగుతుందన్నారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేసి సమస్యలను పరిష్కరించాలన్నారు. సాదా బైనామా దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేసి క్షుణ్ణంగా పరిశీలించి ఆమోదించాలని తెలిపారు. తహసిల్ కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. కార్యాలయానికి వచ్చే ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని, సర్టిఫికెట్లను నిబంధనలకు లోబడి నిర్ణీత గడువులోగా జారీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తహసిల్దార్ జ్యోత్స్న, నాయబ్ తహసిల్దార్ కల్పన, గిర్దావర్లు పద్మజ, మురళీధర్ రావు, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ రాములు



## జాం గ్రామంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

### - సర్పంచ్ కరిపె రవళి విలాస్ హెచ్చరిక

**సారంగాపూర్, జూన్ 10, ప్రభాతవార్త:**

మండలంలోని జాం గ్రామంలో రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని బుధవారం పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా నిర్వహించారు. స్థానిక సర్పంచ్ కరిపె రవళి విలాస్ ఆధ్వర్యంలో మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని, పూడికను పారిశుద్ధ్య కార్మికులతో తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలంతా ఇళ్లలోని తడి, పొడి చెత్తను విడివిడిగా డస్ట్‌బిన్లలో సేకరించి, పంచాయతీ ట్రాక్టర్ వచ్చినప్పుడు అందులోనే వేయాలని సూచించారు. మురుగు కాలువలలో, రోడ్లపైన అక్కడక్కడా చెత్తను పారవేయడం వల్ల వర్షాకాలంలో దోమలు వృద్ధి చెంది అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ఎవరైనా బహిరంగ ప్రదేశాలలో చెత్త వేస్తే కఠిన చర్యలు ఉంటాయని, పంచాయతీ నిబంధనల ప్రకారం జరిమానా వేస్తారని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పంచాయతీ కార్యదర్శి, పారిశుద్ధ్య కార్మికులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నూతన సిసి కెమెరాల ఏర్పాటు

**బజార్‌హత్నూర్, జూన్ 10, ప్రభాతవార్త:**

బజార్ హత్నూర్ గ్రామంలోని ప్రధాన కూడలిలో నూతనంగా ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను బుధవారం గ్రామ సర్పంచ్ పరచ సాయన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు సిసి కెమెరాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ముఖ్యంగా దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడానికి, నిరంతర నిఘా ఉంచడానికి ఇవి ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో వ్యవహరించి గ్రామ రక్షణకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శారదా రాజన్న, గ్రామ ప్రముఖులు బి. మురళీ కృష్ణ, చట్ల వినీల్, కె. గంగయ్య, ప్రేమ్ దాస్, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## నిర్మల్‌లో బెస్ట్ అవైలబుల్ స్కూల్ ప్రవేశాలకు లక్కీడ్రా

**నిర్మల్, జూన్ 10, ప్రభాతవార్త:**



జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య కోసం విద్యార్థులను బుధవారం లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు అధికారులతో కలిసి ఈ డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వెనుకబడిన కులాల విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందులో భాగంగానే బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో ఉచిత ప్రవేశాల సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు వివరించారు. లక్కీ డ్రా ద్వారా ఎంపికైన విద్యార్థులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఎంపిక కాని విద్యార్థులు నిరాశ చెందవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ భోజన్న, సహాయ జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి డి. లత, విద్యార్థుల తల్లిదండ్రులు, రెవెన్యూ, విద్యాశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రీ ప్రైమరీ నియామకాలలో రిజర్వేషన్లు అమలు చేయాలి

### - టీఆర్‌టీఎఫ్ డిమాండ్

**సారంగాపూర్, జూన్ 10, ప్రభాతవార్త**



ప్రీ ప్రైమరీ కేంద్రాలలో నూతనంగా నియమిస్తున్న ప్రీ ప్రైమరీ టీచర్, ఆయా పోస్టులకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తూ నియామకాలను చేపట్టాలని టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దర్శనం దేవేందర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నియామకాలలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకపోవడం వల్ల నిమ్న వర్గాలకు సంబంధించిన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రీ ప్రైమరీ నియామకాల్లో కనీస విద్యార్హత ఇంటర్మీడియట్‌తో పాటు డి.ఎడ్ మార్కులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వెనుకబడిన బహుజన అభ్యర్థులకు న్యాయం జరగాలంటే ఈ నియామకాలలో తప్పకుండా రిజర్వేషన్ పాటిస్తూ, రోస్టర్ విధానాన్ని అమలు చేసే విధంగా జిల్లా విద్యాశాఖ అధికారి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం కార్యదర్శి భూమన్న, సభ్యులు భీమేష్, నర్సయ్య, చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

# పల్ప్‌వుడ్ రైతులే పేపర్ మిల్లుకు వెన్నెముక

- రైతుపరిశ్రమ బంధానికి మరింత బలం - కష్టానికి ఎస్పీఎం గౌరవం

- రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్న ఎస్పీఎం - రైతుల అభివృద్ధితోనే పరిశ్రమ ప్రగతి







**కాగజ్‌నగర్, జూన్ 10, ప్రభాతవార్త**

పల్ప్‌వుడ్ రైతుల అభివృద్ధితోనే పేపర్ పరిశ్రమ అభివృద్ధి సాధ్యమవుతుందని, హరిత భవిష్యత్తుకు రైతులే పునాదులని ఎస్పీఎం పేపర్ మిల్స్ వైస్ ప్రెసిడెంట్ ఏకే మిశ్రా అన్నారు. పట్టణంలోని హెచ్ఆర్‌డీ హాలులో ఎస్పీఎం ఆధ్వర్యంలో పల్ప్‌వుడ్ సాగు చేస్తున్న రైతులకు ఏర్పాటు చేసిన అభినందన, సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత కొన్నేళ్లుగా మిల్లుతో అనుబంధంగా ఉంటూ పల్ప్‌వుడ్ సాగు ద్వారా అధిక దిగుబడులు సాధిస్తున్న రైతులకు కృతజ్ఞతగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పల్ప్‌వుడ్ సాగు చేస్తున్న రైతులకు ఎస్పీఎం యాజమాన్యం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని చెప్పారు. రైతులకు సకాలంలో సాంకేతిక సలహాలు అందించడంతో పాటు సాగుకు అవసరమైన మార్గదర్శకాలు, ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని వివరించారు. రైతులు పండించిన పంట చేతికి రాగానే నేరుగా వారి వద్ద నుంచే కొనుగోలు చేస్తున్నామని, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రెండు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ఎస్పీఎం ఆధ్వర్యంలో దాదాపు 14 వేల మంది పల్ప్‌వుడ్ రైతులు ఉన్నారని, వారికి మద్దతు ధరతో పాటు రవాణా సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు, పరిశ్రమ పరస్పర సహకారంతో ముందుకు సాగితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి వచ్చిన పల్ప్‌వుడ్ రైతులను శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీఎం జీఎం కమర్షియల్ అనిల్ కుమార్, జీఎం ప్లాంటేషన్ మేనేజర్ సురేందర్, జీఎం ఇన్‌స్ట్రుమెంటేషన్ గిరీష్ కుమార్, ఇతర అధికారులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

## 12వ తేదీన ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో వాహనాల వేలం

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 10, ప్రభాతవార్త :**

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో వివిధ కేసుల్లో అక్రమ రవాణా సమయంలో స్వాధీనం చేసుకున్న వాహనాల వేలంపాటను ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్నట్లు కాగజ్‌నగర్ నిషేధ, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వి. రవి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎక్సైజ్ అధికారి బి. జ్యోతి కిరణ్ సమక్షంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు కాగజ్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్‌లో ఈ వేలంపాట నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. అక్రమ మద్యం రవాణా తదితర కేసుల్లో పట్టుబడిన వాహనాలను బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు వెల్లడించారు. వేలంపాటలో పాల్గొనదలచిన ఆసక్తిగల వారు కాగజ్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్‌ను సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవాలని, నిబంధనల మేరకు వేలంలో పాల్గొనవచ్చని అధికారులు సూచించారు.



జుమిడి పోచయ్యను సన్మానిస్తున్న దృశ్యం

## సీనియర్ ఎంపీడబ్ల్యూ వర్కర్ జుమిడి పోచయ్యకు ఘన సన్మానం

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 10, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండలంలోని చింతగూడ గ్రామ పంచాయతీలో సుదీర్ఘకాలం ప్రజాసేవ అందించిన సీనియర్ ఎంపీడబ్ల్యూ (ఎంపీడబ్లూ) వర్కర్ జుమిడి పోచయ్య (కొత్వాల్) పదవీ విరమణ పొందిన సందర్భంగా గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, యువకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జుమిడి పోచయ్యకు శాలువా కప్పి, పూలమాలలతో సన్మానించి ఆయన అందించిన సేవలను కొనియాడారు. గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుద్ధం, ప్రజారోగ్యం, గ్రామాభివృద్ధి కార్యక్రమాల అమలులో ఆయన విశేష కృషి చేశారని పలువురు వక్తలు పేర్కొన్నారు. తన ఉద్యోగ జీవితమంతా ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించిన పోచయ్య గ్రామ ప్రజల అభిమానాన్ని సంపాదించుకున్నారని తెలిపారు. గ్రామాభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. సన్మాన కార్యక్రమంలో పలువురు నాయకులు, యువకులు మాట్లాడుతూ పోచయ్య భవిష్యత్తు జీవితం ఆయురారోగ్యాలతో, ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. అనంతరం పోచయ్య మాట్లాడుతూ తనకు సహకరించిన గ్రామ ప్రజలకు, అధికారులకు, సహోద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కుమ్మరి హరీష్, వార్డు మెంబర్లు సాయి ప్రకాష్, భీంరావు, సంజీవ్, సాగర్, మాజీ ఎంపీటీసీ నికూరే నాగేందర్, అచల్, రావుల నరేష్, పోచయ్య, కారోబార్ మహేష్, గ్రామ పెద్దలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ లేకుంటే గ్రామంలోకి నో ఎంట్రీ..!

### అరైవ్ అలైవ్ లక్ష్యంగా గ్రామసభల్లో రోడ్డు భద్రతా తీర్మానాలు

**మంచిర్యాల, జూన్ 10, ప్రభాతవార్త:**



రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో రోడ్డు ప్రమాదాల నివారణకు గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. "అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామసభల్లో రవాణా, ఎన్‌హెచ్ఏఐ, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య, విద్యాశాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. హెల్మెట్, సీటు బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, మొబైల్ ఫోన్ వినియోగం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లాల్లో జరిగిన వాస్తవ రోడ్డు ప్రమాదాల వీడియోలను ప్రదర్శించి ప్రమాదాల తీవ్రతను వివరించారు. ప్రమాద బాధితులు, మృతుల కుటుంబ సభ్యులు తమ అనుభవాలను గ్రామస్తులతో పంచుకున్నారు. గ్రామసభల్లో హెల్మెట్ లేకపోతే గ్రామంలో ప్రవేశం లేదు హెల్మెట్ లేకపోతే వాహనం నడపరాదు సీటు బెల్ట్ లేకపోతే వాహనం నడపరాదు అనే తీర్మానాలను ప్రజలు స్వచ్ఛందంగా ఆమోదించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షిత ప్రయాణానికి సహకరించాలని పోలీసు అధికారులు కోరారు.




## తాండూర్‌లో ప్రత్యేక గ్రామసభ

**తాండూర్, జూన్ 10, ప్రభాతవార్త :**

తాండూర్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ సురేష్ అధ్యక్షతన బుధవారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. వర్షాకాల సన్నద్ధత, సురక్షి త తాగునీరు, ఘన వ్యర్థాల నిర్వహణ, జల సంరక్షణ, వన మహోత్సవం, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, వరదల నిర్వహణ, భద్రత తదితర అంశాలపై చర్చించారు. గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి శ్రీనివాస్, ఉప సర్పంచ్ సత్యనారాయణ, గ్రామ కార్యదర్శి దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

## మోదీ ప్రధానిగా 12 ఏళ్లు పూర్తి

### ఆలయంలో ప్రత్యేక పూజలు

**సారంగాపూర్, జూన్ 10, ప్రభాతవార్త:**

నరేంద్ర మోదీ దేశ ప్రధానమంత్రిగా పదవిని స్వీకరించి 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మండలంలోని చించోలి (ఎం) గ్రామంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల బీజేపీ అధ్యక్షుడు కాల్వ నరేష్ ఆధ్వర్యంలో స్థానిక రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఈ కార్యక్రమం చేపట్టారు. దేశంలోనే అత్యధిక రోజులు ప్రధానమంత్రి పదవిని చేపట్టిన అగ్రగణ్యులలో ఒకరిగా మోదీ నిలిచినందుకు కృతజ్ఞతగా ఈ పూజలు చేశారు. ఈ సందర్భంగా కాల్వ నరేష్ మాట్లాడుతూ సేవ, సుశాసనం, సంకల్పానికి ప్రతీకగా నిలిచిన ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ ఆత్మవిశ్వాసం, ఆత్మనిర్భరత దిశగా అపూర్వ ప్రగతిని సాధించిందన్నారు. దేశ భద్రత నుంచి మౌలిక వసతుల వరకు, పేదల సంక్షేమం నుంచి ప్రపంచ వేదికపై భారత ప్రతిష్ఠ వరకు ప్రతి రంగంలో చారిత్రాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని కొనియాడారు. "వికసిత్ భారత్ 2047" లక్ష్య సాధనకు మోదీ బలమైన పునాదులు వేశారని పేర్కొన్నారు. సనాతన భారతీయ విలువలను పరిరక్షిస్తూ, నవ భారత నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్న ప్రధాని మోదీ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ సూచనల మేరకు ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. రాబోయే వర్షాకాలంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు పుష్కలంగా పండాలని దేవుడిని ప్రార్థించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శేఖర్, గంగాధర్, రాజేశ్వర్, కార్తీక్, రమేష్, నర్సయ్య, సాయన్న, గంగన్న, సుభాష్, నవీన్, గ్రామస్థులు పాల్గొన్నారు.



## పాఠశాల భవనానికి మౌలిక వసతుల కల్పన

### - జిల్లా కలెక్టర్ కె.హరిత

**కాగజ్‌నగర్, జూన్ 10, ప్రభాతవార్త**



గత 10 సంవత్సరాలుగా మూతపడిన ప్రభుత్వ పాఠశాల భవనానికి మరమ్మత్తులు చేసి మౌలిక వసతులు కల్పించి తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు సాధ్యసాధ్యాలు పరిశీలించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లాలోని కాగజ్ నగర్ పట్టణంలోని 13వ వార్డు కాపు వాడలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం మూతపడి ఉన్న విషయాన్ని తెలుసుకొని విద్యాశాఖ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తూ అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందని తెలిపారు. ఈ క్రమంలో గత 10 సంవత్సరాలుగా మూతపడి ఉన్న పాఠశాలను పునరుద్ధరించేందుకు గల సాధ్యాసాధ్యాలను విద్యాశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మౌలిక సదుపాయాలు కల్పించి పున ప్రారంభించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి వాసాల ప్రభాకర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం అవసరం

**ఆసిఫాబాద్ టౌన్, జూన్ 10, ప్రభాతవార్త :**

పట్టణాన్ని పరిశుభ్రంగామార్చడమే మనందరి లక్ష్యం కావాలని మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ అన్నారు. బుధవారం పట్టణంలోని జనకాపూర్ రైతు వేదికలో మున్సిపల్ ఆధ్వర్యంలో 1,13,14,15 వార్డుల ప్రత్యేక సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణ కేవలం మున్సిపల్ సిబ్బంది బాధ్యత మాత్రమే కాదని, ఇందులో ప్రతి ఒక్క పౌరుడి భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. ఇండ్లలో ఉత్పత్తయ్యే తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకే అందించాలి తప్ప రోడ్లపై, డ్రైనేజీలలో వేయవద్దని కోరారు. వార్డు సభల ద్వారా ప్రజల నుంచి వచ్చే విజ్ఞప్తులను, సమస్యలను ఎప్పటికప్పుడు రికార్డు చేస్తున్నామని తెలిపారు. వర్షాకాలం ముంచుకొస్తున్న తరుణంలో దోమల నివారణకు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు వార్డులలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌లు నిర్వహిస్తామన్నారు. త్వరలోనే అన్ని వార్డులలో మౌలిక వసతుల కల్పన పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. వార్డుల వారీగా ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం వారు రైతు వేదిక ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా, కౌన్సిలర్ వినోద్, విద్యుత్ శాఖ ఏఈ లక్ష్మీ రాజం, మున్సిపల్ ఏఈ నవీన్, మున్సిపల్ సిబ్బంది, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## సుంపుటంలో గ్రామసభ

### అభివృద్ధి, సంక్షేమ అంశాలపై చర్చ..

**వేమనపల్లి, జూన్ 10, ప్రభాతవార్త :**

సుంపుటం గ్రామపంచాయతీలో బుధవారం గ్రామసభను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక అధికారి ఏఈఈ (పీఆర్) ప్రదీప్, సర్పంచ్ దుర్గం భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ గ్రామసభలో గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం, ఘన వ్యర్థాల నిర్వహణ, ఎరువుల లభ్యత, రైతుల సమస్యలు, మాదకద్రవ్యాల నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ, విపత్తు నిర్వహణ, తాగునీటి సరఫరా, పారిశుద్ధం, వీధి దీపాల నిర్వహణ, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై అధికారులు గ్రామస్థులకు వివరించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని పేర్కొన్న అధికారులు, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కుమారస్వామి, నీల్వాయి ఎస్సై జగదీశ్వర్ రెడ్డి, ఉపసర్పంచ్ దందేర మహేష్, గ్రామ కార్యదర్శి వెంకటి, వివిధ శాఖల అధికారులు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, రైతులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జీడీఆర్ ప్రతిభ పురస్కారాల జాబితా విడుదల

### - ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ అనిల్ కుమార్ జాదవ్

**భైంసా, జూన్ 10, ప్రభాతవార్త:**



గత మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థుల వివరాలతో కూడిన జీడీఆర్ ప్రతిభ పురస్కారాల జాబితాను జీడీఆర్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ అనిల్ కుమార్ జాదవ్ బుధవారం విడుదల చేశారు. ఈ పురస్కారానికి ఎంపికైన విద్యార్థులలో 586 మార్కులు సాధించిన జీ శశికాంత్ ప్రథమ స్థానంలో నిలవగా, 569 మార్కులతో ఎస్ కిరణ్యా ద్వితీయ స్థానంలో, 561 మార్కులతో కే వైష్ణవి తృతీయ స్థానంలో నిలిచారు. ప్రతిభ చాటిన ఈ విద్యార్థులను గురువారం సాయంత్రం 4:00 గంటలకు భైంసాలోని జీడీఆర్ కృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో నగదు పురస్కారంతో పాటు ఘనంగా సన్మానించనున్నారు. ఈ పురస్కారానికి ఎంపికైన విద్యార్థులు మరిన్ని వివరాల కోసం 94413 33315 నంబరును సంప్రదించవచ్చని ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు.

# పరిశ్రమల అభివృద్ధిపై అధికారుల అధ్యయన పర్యటన

**కాగజ్‌నగర్, జూన్ 10, ప్రభాతవార్త :**

కోమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా పరిశ్రమల కేంద్రం సిబ్బంది మరియు వివిధ శాఖల అధికారులు హైదరాబాద్‌లో నిర్వహించిన అధ్యయన పర్యటనలో పాల్గొన్నారు. పరిశ్రమల అభివృద్ధి, సూక్ష్మ,చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహానికి సంబంధించిన పలు సంస్థలను సందర్శించి వాటి కార్యకలాపాలను పరిశీలించారు. పర్యటన మొదటి రోజు రాష్ట్ర పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వ్యవస్థాపకుల అభివృద్ధి కార్యక్రమం గురించి అవగాహన పొందారు. అనంతరం ఒక జిల్లా ఒక ఉత్పత్తి" పథకం అమలు, స్థానిక ఉత్పత్తుల ప్రోత్సాహం, మార్కెటింగ్ అవకాశాలపై అధికారులతో చర్చించారు. అలాగే తెలంగాణ పారిశ్రామిక ఆరోగ్య సహాయ కేంద్రాన్ని సందర్శించి పారిశ్రామిక వేత్తలకు అందిస్తున్న సేవలను తెలుసుకున్నారు. రెండవ రోజు పరిశోధన, ఆవిష్కరణల ప్రోత్సాహక సంస్థను సందర్శించి సూక్ష్మ,చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధిలో పరిశోధనల ప్రాధాన్యతపై అవగాహన పొందారు. అనంతరం వ్యాపార ప్రోత్సాహక కేంద్రాన్ని సందర్శించి నూతన ఆలోచనలతో ముందుకు వస్తున్న యువతకు అందిస్తున్న అవకాశాలు, సౌకర్యాలను పరిశీలించారు. అలాగే ప్రముఖ పారిశ్రామిక సంస్థను సందర్శించి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమల నిర్వహణ విధానాలను అధ్యయనం చేశారు. మూడవ రోజు నవకల్పనలకు ప్రోత్సాహం అందించే కేంద్రాన్ని సందర్శించి కొత్త పరిశ్రమల స్థాపన, ఉపాధి అవకాశాల కల్పన, యువ పారిశ్రామిక వేత్తలకు అందిస్తున్న





సహకారం గురించి సమగ్ర అవగాహన పొందారు. ఈ అధ్యయన పర్యటన ద్వారా పరిశ్రమల అభివృద్ధి, పారిశ్రామిక వేత్తల ప్రోత్సాహం, ఉపాధి అవకాశాల విస్తరణకు సంబంధించిన ఆధునిక విధానాలను తెలుసుకుని జిల్లాలో అమలు చేసేందుకు అవసరమైన సూచనలు, అనుభవాలను సేకరించినట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ తెలిపారు.



డిఆర్ఓ వేణుకు వినతిపత్రం అందజేస్తున్న సిపిఐ నాయకులు

## కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

**ఆసిఫాబాద్, జూన్ 10, ప్రభాతవార్త :**

నిత్యావసర వస్తువుల కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బద్రి సాయికుమార్ డిమాండ్ చేశారు, బుధవారం కలెక్టరేట్ లోని డిఆర్ఓ ఛాంబర్ లో సిపిఐ ఆధ్వర్యంలో డిఆర్ఓ వేణు కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపుమేరకు కలెక్టరేట్ లో వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. బిజెపి పాలనలో సామాన్యుడి బతుకు భారంగా మారిందని, వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జఅచ్చే దిన్‌చ వస్తాయని చెప్పి, సామాన్య, మధ్యతరగతి కుటుంబాల జేబులకు చిల్లులు పెడుతున్నారని, కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల రూపాయల పన్ను రాయితీలు ఇస్తున్న బిజెపి ప్రభుత్వం, సామాన్యులపై మాత్రం పన్నుల భారం వేస్తూ ధరల నియంత్రణలో పూర్తిగా విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరు చిరంజీవి, జిల్లా కార్యవర్గ సభ్యులు తిరుపతి, మారం శ్రీనివాస్, సీపీఐ జిల్లా సమితి సభ్యులు కాంద్ర అజయ్ కుమార్, మిస చంద్రశేఖర్, కందుల మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి గోడ కూలి చిన్నారి మృతి

**తాండూర్, జూన్ 10, ప్రభాతవార్త :**

మండలంలోని అచ్చులాపూర్ గ్రామంలోనీ ఎస్సీ కాలనీలో పాత ఇంటి గోడ కూలి సూనైత్రి (5) అనే బాలిక మృతి చెందింది. గ్రామస్తుల కథనం ప్రకారం సునైత్రి, మరో ఇద్దరు బాలికలు ఇంటి పక్క ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు గోడ కూలి బాలికపై పడడం తో మృతి చెందింది. మరో ఇద్దరు బాలికలు తృటిలో ప్రమాదం నుంచి బయటపడ్డారు. బాలిక మృతితో కుటుంబంలో విషాదఛాయలు అనుముకున్నాయి. సంఘటన స్థలాన్ని తాండూర్ పోలీసులు, రెవిన్యూ అధికారులు సందర్శించారు.



## నర్సాపూర్‌లో బోరింగ్ నిర్మాణ పనులు ప్రారంభం

**తాండూర్, జూన్ 10, ప్రభాతవార్త :**

మండలంలోని నర్సాపూర్ గ్రామంలో బుధవారం బోరింగ్ నిర్మాణ పనులను సర్పంచ్ మాడవి ప్రభాత్ రావు, మంచిర్యాల డిసిసి ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి సహకారంతో త్రాగునీటి అవసరాల కోసం నూతన బోరింగ్ పనులకు డిఎంఎఫ్టి నిధుల మంజూరయ్యాన్నారు. ఈ బోరింగ్ నిర్మాణంతో గ్రామస్తులకు మంచినీటి సమస్య తీరనున్నదన్నారు. కార్యక్రమంలో మాదారం, నీలయపల్లి సర్పంచులు కున్నపల్లి లక్ష్మణ్, పోలవేని తిరుపతి, ఉప సర్పంచులు పర్వతరావు, సూరం దామోదర్ రెడ్డి, వార్డు సభ్యులు తొడసం బాదు, జేనేని రజిత, ఆత్రం గౌరబాయి, గ్రామస్తులు మడవి మాణిక్ రావు, భగవత్ రావు, రాజు, పంచాయతీ కార్యదర్శి జగదీష్, తదితరులు పాల్గొన్నారు.



నర్సాపూర్‌లో బోరింగ్ పనులను ప్రారంభిస్తున్న నాయకులు

## నూతన జిఎంను సన్మానించిన నాయకులు

**తాండూర్, జూన్ 10, ప్రభాతవార్త :**

బెల్లంపల్లి ఏరియా నూతన జిఎంగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శ్రీ రమేష్ ను గోలేటి జిఎం కార్యాలయంలో బుధవారం ఐఎన్టీయూసి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఐ ఎన్ టి యు సి బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, మంచిర్యాల డిసిసి ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి జిఎం శ్రీ రమేష్ ను శాలువలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్, మాదారం, నీలాయపల్లి సర్పంచులు ప్రభాత్ రావు, కుషనపల్లి లక్ష్మణ్, పోలవేణి తిరుపతి, ఉప సర్పంచులు పర్వత్ రావు సూరం దామోదర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# ప్రొఫెసర్ కోదండరాంకు తెలంగాణ ఉద్యమకారులు ఐక్యవేదిక నాయకుల వినతి



ప్రొఫెసర్ కోదండరాంకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు, తెలంగాణ ఉద్యమకారులు



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే హరీష్‌బాబు, తెలంగాణ ఉద్యమకారులు

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 10, ప్రభాతవార్త**

హైదరాబాద్‌లో బుధవారం తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ ప్రాంతానికి చెందిన తెలంగాణ ఉద్యమకారులు ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యుడు, ప్రముఖ ఉద్యమ నాయకుడు ప్రొఫెసర్ కోదండరాంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు తమ సమస్యలు, అభ్యర్థనలను ప్రొఫెసర్ కోదండరాం దృష్టికి తీసుకువెళ్లారు. తొలి దశ, మలి దశ తెలంగాణ ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్న అనేక మంది ఉద్యమకారులు కాగజ్‌నగర్ ప్రాంతంలో ఉన్నప్పటికీ, ఇప్పటివరకు సరైన గుర్తింపు పొందలేదని వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారుల గుర్తింపు కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. కాగజ్‌నగర్ ప్రాంతంతో ప్రొఫెసర్ కోదండరాంకు ప్రత్యేక అనుబంధం ఉందని, తెలంగాణ ఉద్యమ సమయంలో పలుమార్లు ఆ ప్రాంతాన్ని సందర్శించిన విషయాన్ని గుర్తు చేశారు. ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియలో వివిధ సంఘాలు, సంస్థలను భాగస్వాములను చేస్తున్న నేపథ్యంలో తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదికను కూడా భాగస్వామ్యం చేసి, సమావేశాలు, కార్యక్రమాలపై ముందస్తు సమాచారం అందించాలని కోరారు. దీనికి స్పందించిన ప్రొఫెసర్ కోదండరాం, ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తున్నామని, తప్పకుండా సమాచారం అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే కాగజ్‌నగర్ ప్రాంతంలో నిజమైన ఉద్యమకారులను గుర్తించి, సమగ్ర జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక కన్వీనర్ ఈర్ల విశ్వేశ్వర్‌రావు, పలువురు ఉద్యమకారులు, నాయకులు పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమంలో సేవలందించిన ప్రతి ఉద్యమకారుడికి న్యాయం జరిగేలా కృషి చేయాలని వారు కోరారు.

## సిర్పూర్ పేపర్ మిల్లులో వెరిఫికేషన్ ఎన్నికలు నిర్వహించాలి

### - కార్మిక సంఘాల జేఏసీ డిమాండ్

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 10, ప్రభాతవార్త :**

సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు కార్మిక సంఘం వెరిఫికేషన్ ఎన్నికలను తక్షణమే నిర్వహించాలని కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) డిమాండ్ చేసింది. ఎన్నికల ప్రక్రియకు అడ్డంకిగా ఉన్న కోర్టు కేసును యాజమాన్యం వెంటనే ఉపసంహరించుకోవాలని కోరింది. ఎస్పీఎం గేటు వద్ద కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల నేపథ్యంలో రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయంలో మంగళవారం సిర్పూర్ పేపర్ మిల్లు యాజమాన్యం, కార్మిక సంఘాల ప్రతినిధులతో ఉమ్మడి సమావేశం నిర్వహించారు. జాయింట్ కమిషనర్లు చంద్రశేఖర్, రాజేంద్ర ప్రసాద్ సమక్షంలో జరిగిన సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలను అనవసరంగా వాయిదా వేయడం సరికాదని, కార్మికుల ప్రజాస్వామ్య హక్కులను గౌరవిస్తూ వెంటనే వెరిఫికేషన్ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ద్వారా మెజారిటీ మద్దతు పొందిన సంఘానికి గుర్తింపు కల్పించడం వల్ల పరిశ్రమలో సుస్థిర కార్మిక సంబంధాలు నెలకొంటాయని పేర్కొన్నారు. సమావేశంలో సిర్పూర్ పేపర్ మిల్ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జే. మల్లికార్జున్, మాజీ కార్మిక శాఖ మంత్రి పెద్దిరెడ్డి, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, జేఏసీ నాయకులు, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన జేఏసీ నాయకులు కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం, యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని కోరారు. వెరిఫికేషన్ ఎన్నికలపై స్పష్టమైన నిర్ణయం తీసుకుని కార్మికుల ఆందోళనలకు ముగింపు పలకాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిర్పూర్ పేపర్ మిల్లు గేటు ముందు రిలే నిరాహార దీక్షలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గోలెం వెంకటేశం, వల్లాల సుభాష్, కూషణ రాజన్న, ముంజం శ్రీనివాస్, గోగర్ల రాములు, కల్లూరి శ్రీనివాస్, అంబాల ఓదెలు, రాగులయ్య, కలికోట రమణయ్య, బింగి రమేష్, సి. వెంకటేశ్, షబ్బీర్, నగరం గణపతి, రాజేష్ యాదవ్, నానాజీ, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.





## ఈవీఎం గోదాం తనిఖీ.. వైద్య సేవలపై కలెక్టర్ భవేష్ మిశ్రా సమీక్ష

**నిర్మల్, జూన్ 10, ప్రభాతవార్త:**

కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం భద్రతా గోదాంను బుధవారం జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా సాధారణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాం ప్రాంగణంలోని రిజిస్టర్లను పరిశీలించి, సీసీ కెమెరాల పనితీరును క్షుణ్ణంగా తనిఖీ చేశారు. భద్రతా విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది నిరంతరం సీసీ కెమెరాలను పర్యవేక్షిస్తూ భద్రతను మరింత మెరుగుపరచాలని, పటిష్టమైన అగ్నిమాపక వ్యవస్థను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, అధికారులు సర్ఫరాజ్, రాజశ్రీతో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు శ్రవణ్, మజార్, హైదర్, మహేష్ రెడ్డి, రమేష్, సుశీల్ కుమార్, నరేష్ పాల్గొన్నారు.

### వైద్య సేవలపై సమీక్ష..

అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రభుత్వ ఆసుపత్రుల వైద్య సేవలపై కలెక్టర్ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు ప్రైవేట్‌కు దీటుగా నాణ్యమైన వైద్యాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు. సర్కారు దవాఖానాల్లో ప్రసవాల సంఖ్యను పెంచుతూ, సాధారణ (నార్మల్) ప్రసవాలకే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వైద్య సేవలపై ప్రజల్లో నమ్మకం పెంపొందించాలని, రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిన్నారులకు సకాలంలో టీకాలు వేయడంతో పాటు, జిల్లాలో నిర్మాణంలో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాల పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డీఎంహెచ్ఓ రాజేందర్, గోపాల్ సింగ్, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ శారద, కాశీనాథ్, వైద్య అధికారులు పాల్గొన్నారు.



## సురక్షిత ప్రయాణమే కుటుంబానికి నిజమైన బహుమతి

- చెన్నూరు రూరల్ సీఐ ఆర్. కృష్ణ
- పారుపల్లి గ్రామ సభలో అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహణ
- గంజాయికి దూరంగా ఉండాలని యువతకు పిలుపు
- అగ్నివీర్ విజేత రాజేష్‌కు ఘన సన్మానం

**కోటపల్లి, జూన్ 10 ప్రభాతవార్త:**

ప్రజా ప్రణాళిక ప్రగతి నివేదిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా బుధవారం పారుపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామ సభకు చెన్నూరు రూరల్ సీఐ ఆర్. కృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు రోడ్డు భద్రతపై ఆయన విస్తృత అవగాహన కల్పించారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ ధరించకపోవడం వల్ల జరుగుతున్న ప్రమాదాలు ఎన్నో కుటుంబాలలో విషాదాన్ని నింపుతున్నాయని సీఐ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో గ్రామానికి చెందిన కొందరు యువకులు రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన ఉదంతాలను గుర్తు చేస్తూ.. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. ప్రమాదాల నివారణకు తెలంగాణ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, ఓవర్ స్పీడ్, ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్‌లపై ప్రత్యేక నిఘా మరియు నిరంతర పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా, గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల వల్ల యువత తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, గంజాయి రవాణా మరియు విక్రయాల నిర్మూలనకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఇటీవల అగ్నివీర్‌లో సైనిక ఉద్యోగం సాధించిన గ్రామ యువకుడు భోగే రాజేష్‌ను సీఐ శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా కోటపల్లి ఎస్సై రాజశేఖర్‌తో కలిసి గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అధ్యక్షుడు తొగురు శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, యువకులు, మహిళలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్య

**దహెగాం, జూన్ 10, ప్రభాతవార్త :**



పురుగుల మందు తాగి యువతీ మృతి చెందినట్లు దహెగాం ఎస్ ఐ రమేష్ తెలిపారు. అయన తెలిపిన వివరాల ప్రకారం పెసరికుంట గ్రామానికి చెందిన రాంటెంకి లస్మయ్య (42) అతనికి ఇద్దరు కూతుర్లు పెద్ద కూతురు జ్యోష్న (17) ఇంటర్మీడియట్ పూర్తి చేసింది కౌటాల గ్రామనికి చెందిన తన వరుసకు బావ అయిన అరుణ్ భార్య సంగీత జ్యోష్న కి అక్క తన ఇంటికి వెళ్లిది వెళ్లే క్రమంలో అరుణ్ తో పరిచయం ఏర్పడి ఫోన్ లో చాటింగ్ చేసుకునేవాళ్ళు ఫోన్ లో చాటింగ్ ని అరుణ్ భార్య కు తెలవడంతో సంగీత 4వ తేదీన జ్యోష్న వాళ్ళ ఇంటికి వచ్చి జ్యోష్న ను సంగీత వాళ్ళ అమ్మ కమల కొట్టారని అ సమయంలో అరుణ్ అక్కడే ఉన్నాడని మళ్ళీ 7 వ తారీఖు నా సాయంత్రం 6గంటల 30 నిమిషాలకు మళ్ళీ వచ్చి సంగీత, కమల కొడుతు లంజముండ అని నువ్వు చావు ఎందుకు బతికినవ్ అని తిడుతూ నా భర్త నీకు కావాలా భూతులు తిడుతూ ఇష్టం వచ్చినట్లు కొట్టారని జ్యోష్న తండ్రి లస్మయ్య ఇంటికి రాగానే వారు అక్కడి నుండి వెళ్లిపోయారు. అరుణ్ అక్కడే ఉన్నాడు. వాళ్ళు ఇష్టం వచ్చినట్లు కొట్టడం భూతులు తిట్టడంతో జ్యోష్న మనస్థపానికిగురై తన ఇంటిలో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్య ప్రయత్నం చేసింది వెంటనే హాస్పిటల్ కి తరలించారు పరిస్థితి విషమించి 9వ తేదీన వరంగల్ లోని ఎం జీ ఎం హాస్పిటల్ లో చనిపోయిందని తన కూతురు చావుకు అన్న కూతురు సంగీత, అల్లుడు అరుణ్ వదిన కమల అని మృతురాలి తండ్రి లస్మయ్య ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ ఐ తెలిపారు.



వార్డు సభలో పాల్గొన్న మేయర్, తదితర సభ్యులు

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

### - వార్డు సభలో మేయర్ దర్శి మధుకర్

**మంచిర్యాల, జూన్ 10 ప్రభాతవార్త:**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 53వ డివిజన్‌లో బుధవారం వార్డు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ మేయర్ దర్శి మధుకర్ ముఖ్య అతిథిగా హాజరై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరవేయాలనే ఉద్దేశంతో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. వార్డు సభలో వివిధ శాఖల అధికారులను ప్రజలకు అందుబాటులో ఉంచామని, డివిజన్‌లోని అర్హులైన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అలాగే పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రోడ్ల మరమ్మతులు, వీధి విద్యుత్ దీపాల నిర్వహణ, శాంతి భద్రతలు తదితర సమస్యలు ఏవైనా ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ నూర్జహాన్ బేగం, ఎస్ఐ మజారుద్దీన్, విద్యుత్, వ్యవసాయ, హౌసింగ్ శాఖల అధికారులు, డివిజన్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఎస్పీయం కార్మిక సంఘాల జేఏసీ దీక్షలకు విద్యార్థి-నిరుద్యోగ జేఏసీ మద్దతు

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 10, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్‌లోని సిర్పూర్ పేపర్ మిల్స్ (ఎస్పీయం) కంపెనీ ప్రధాన గేటు ఎదుట కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరవధిక దీక్షలు గురువారంతో 22వ రోజుకు చేరుకున్నాయి. కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిర్వహిస్తున్న ఈ దీక్షలకు విద్యార్థి–నిరుద్యోగ జేఏసీ జిల్లా కన్వీనర్ పొన్న రమేష్ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా పొన్న రమేష్ మాట్లాడుతూ ఎస్పీఎం కంపెనీలో కార్మిక సంఘాల ఎన్నికలను తక్షణమే నిర్వహించాలని, స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మిక శాఖ కమిషనర్, కార్మిక శాఖ మంత్రి చర్చలకు ఆహ్వానించడం శుభపరిణామమని, ఈ చర్చలు సఫలమై కార్మికుల సమస్యలకు పరిష్కారం లభించాలని ఆకాంక్షి ంచారు. ప్రభుత్వం నుంచి భారీ రాయితీలు పొందుతున్న ఎస్పీఎం యాజమాన్యం స్థానికుల ఉద్యోగాల విషయంలో నిరక్ష్య ధోరణి అవలంబిస్తోందని విమర్శించారు. కాలుష్య భారాన్ని స్థానిక ప్రజలు భరిస్తుండగా, ఉద్యోగాలు మాత్రం స్థానికేతరులకు ఇస్తున్నారని ఆరోపించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని, ఎన్నికల నిర్వహణకు ముందడుగు వేయాలని కోరారు. సమస్యలను నిరక్ష్యం చేస్తే సిర్పూర్ నియోజకవర్గంలో మరో తెలంగాణ ఉద్యమానికి దారి తీసే పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఈ దీక్షల్లో పాల్గొంటున్న జేఏసీ నాయకులు గోగార్ల శ్యామ్‌రావు, అరుణ్‌కుమార్, ఎ.కె. సింగ్‌లకు సంఘీభావం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు, విద్యార్థి–నిరుద్యోగ జేఏసీ సభ్యులు పాల్గొన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం పోరాటం కొనసాగుతుందని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు.



దీక్షల్లో కూర్చునున్న విద్యార్థి, నిరుద్యోగ జేఏసి

# శాంతిఖని బొగ్గు గనిని సందర్శించిన ఆస్ట్రేలియా ప్రతినిధి బృందం





**బెల్లంపల్లి, జూన్ 10, ప్రభాతవార్త:**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణం లోని శాంతిఖనిబొగ్గు గనిని బుధవారం నలుగురు సభ్యులతో కూడిన ఆస్ట్రేలియా ప్రతినిధి బృందం సందర్శించింది. ఈ బొగ్గు గనిలో ఇంకా అపార మైన బొగ్గు నిక్షేపాలున్నందున ఈగనిని నడిపించాలని సింగరేణి సంస్థ తీసుకున్న నిర్ణయంలో భాగంగాఆస్ట్రేలియా సాంకేతిక పరిజ్ఞానం తో బొగ్గు ఉత్పత్తి ని సాధించేందుకు ఉన్న అవకాశాలు, అవసరమయ్యే తగు సాంకేతిక పరిజ్ఞానం ఆవశ్యకత పై గని లోని పని స్థలాలను ప్రతినిధి బృందం పరిశీలించింది. గనిలో సాలార్జింగ్ సీమ్, సౌత్, నార్త్, ఈస్ట్ బొగ్గు నిక్షేపాలు ఉన్న స్థలాలను ప్రతినిధి బృందం పరిశీలించింది. గనిని సందర్శించిన ప్రతినిధి బృందంలో ఆస్ట్రేలియా కు చెందిన బ్రిజ్బెన్ నగరం లోని టాలి యామన్ అనే కన్సల్ టెన్సీ కంపెనీ ( మైనింగ్ ఎక్వ్యాప్ మెంట్ సర్వీసెస్ కంపెనీ )డైరెక్టర్ గ్రాంట్ పోల్డ్, జీ ఎం జెరార్డ్ మిల్లర్,అహ్మదాబాద్ మైనింగ్ కన్సల్ టెన్సీ నందన్, దన్బాద్ కుంచెందిన మైనింగ్ ప్రొఫెసర్ సిన్హా లు ఉన్నారు. కాగా ఈ ప్రతినిధి బృందం జిఎం రాధాకృష్ణ ఇతర అధికారులతో క్షుణ్ణంగా చర్చించి తగు నివేదికను రూపొందించనున్నారు. నివేదికను నేడు హైదరాబాదు లోని సింగరేణి భవన్ లో సీ అండ్ ఎం డీ తో జరిగే సమావేశంలో ఆస్ట్రేలియా ప్రతినిధి బృందం పాల్గొని తగు నివేదికను సీ అండ్ ఎం డీ కి అందజేస్తారు. అంతకు ముందు ఆస్ట్రేలియా ప్రతినిధి బృందానికి జిఎం రాధాకృష్ణ, గని మేనేజర్ సంజయ్ కుమార్ సిన్హా, గని ప్రాజెక్టు అధికారి మొహమ్మద్ అబ్దుల్ ఖదీర్,కొత్త ప్రాజెక్ట్ అధికారి ఎస్ సంతోష్ కుమార్, శాంతిఖని గ్రూప్ ఇంజనీర్ బసవరాజ్ లు ఆస్ట్రేలియా ప్రతినిధి బృందానికి స్వాగతం పలికారు. గని మేనేజర్ కార్యాలయంలో శాంతిఖని బొగ్గు గని స్థితిగతులను అధికారులు ప్రతినిధి బృందానికి వివరించారు.

## జాగరణ్ మంచ్, మార్వాడీ యువ మాంచ్ ఆధ్వర్యంలో జూన్ 14న రక్తదాన శిబిరం

**కాగజ్‌నగర్ రూరల్,జూన్ 10, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ పట్టణంలో హిందూ జాగరణ్ మంచ్, మార్వాడీ యువ మాంచ్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 14 ఆదివారం నాడు భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అగ్రసేన్ భవన్‌లో ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ శిబిరంలో యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తదానం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు ప్రాణదానం చేసినట్లేనని పేర్కొన్నారు. రక్తదాన శిబిరంలో పాల్గొనే వారికి ఉచితంగా షుగర్, రక్తపోటు (బీపీ), హీమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆరోగ్యవంతమైన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి ఈ మహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఒక్క యూనిట్ రక్తం ఎన్నో ప్రాణాలకు భరోసా. మీ చిన్న సహాయం ఎవరికో కొత్త జీవితాన్ని అందించగలదు” అని నిర్వాహకులు పేర్కొన్నారు. సమాజ సేవలో భాగంగా నిర్వహిస్తున్న ఈ రక్తదాన శిబిరంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## ఐకేపీ సిబ్బందికి ముందే శిక్షణ ఇవ్వాల్సింది

### - యువ రైతు నేత బాజీరావు పాటిల్

**భైంసా, ప్రభాతవార్త:**



జొన్న కొనుగోలు కేంద్రాల నిర్వహణను అప్పగించే ముందే ఐకేపీ సిబ్బందికి సరైన శిక్షణ ఇవ్వాల్సిందని యువ రైతు నేత బాజీరావు పాటిల్ అన్నారు. భైంసా మండలంలోని పలు గ్రామాల గోదాముల్లో రైతుల జొన్నల అన్‌లోడింగ్ కోసం తీవ్ర జాప్యం జరుగుతుండటంతో, రైతుల పిలుపు మేరకు ఆయన బుధవారం క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక అధికారులతో మాట్లాడుతూ సాంకేతిక లోపాలను సాకుగా చూపిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే కేంద్రాలు ప్రారంభించక ముందే సరిదిద్దుకోవాల్సిందని సూచించారు. మహారాష్ట్ర నుంచి వచ్చే జొన్నల కొనుగోళ్ల దళారీ వ్యవస్థను కొందరు బడా నాయకులు ప్రోత్సహిస్తున్నారని, దీని వల్లే స్థానిక రైతులకు టోకెన్ల జారీ ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోందని ఆరోపించారు. స్థానిక రైతుల నుంచి ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేసి ఇబ్బందులు తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, నాయకులు పాల్గొన్నారు.

## 12 ఏళ్ల స్వర్ణయుగం

### అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

**భైంసా, జూన్ 10, ప్రభాతవార్త:**

నరేంద్ర మోదీ దేశ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించి 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బుధవారం భైంసా పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సేవ, సుశాసనం, సంకల్పానికి ప్రతీకగా నిలిచిన ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ అభివృద్ధి, ఆత్మవిశ్వాసం, ఆత్మనిర్భరత దిశగా అపూర్వ ప్రగతిని సాధించిందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. గత 12 ఏళ్లలో దేశ భద్రత నుంచి మౌలిక వసతుల వరకు, పేదల సంక్షేమం నుంచి ప్రపంచ వేదికపై భారత ప్రతిష్ఠ వరకు ప్రతి రంగంలో చారిత్రాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి, “వికసిత్ భారత్ 2047“ లక్ష్య సాధనకు మోదీ బలమైన పునాదులు వేశారన్నారు. సనాతన భారతీయ విలువలను పరిరక్షిస్తూ, నవ భారత నిర్మాణాన్ని వేగవంతం చేస్తూ ప్రపంచానికి మార్గదర్శకంగా భారత్‌ను నిలబెడుతున్న ప్రధాని మోదీ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ సూచనల మేరకు ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. వానాకాలంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు పుష్కలంగా పండాలని ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు రావుల రాము, కౌన్సిలర్లు చర్ల సుభాష్, దగ్గె శ్రీకాంత్, జె. రాహుల్, కోఆప్షన్ సభ్యుడు తోట లింగు, నాయకులు రామ్ బండారి, కాసరోల్ల ప్రవీణ్, కార్తీక్, కానోళ్ల నరేష్, మహేష్, మారుతి, యోగేష్, బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు